
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శనివారం 30 ఆగస్టు 2025

నేడు తెలుగు భాషా దినోత్సవం

బెంగళూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమం శనివారం వయ్యాలికావల్‌లోని కృష్ణదేవరాయ కళామందిరంలో నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు రాధాకృష్ణరాజు తెలిపారు. గిడుగు రామమూర్తి పంతులు 163వ జయంతిని పురస్కరించుకుని వేడుకలు జరుపుతున్నట్టు తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి తెలుగు అభిమానులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.



సన్నగిల్లిన సహకారం





- నష్టాల బాటలో సహకార సంఘాలు

●అయోమయంలో 14,670 సంఘాల భవిష్యత్తు ● రుణవసూళ్లు కాక ఖజానా ఖాళీ ● నిధులు నిలిపేసిన నాబార్డు ● అధికారులపై నేతల ఒత్తిళ్లు ● అప్పుల ఊబిలో అన్నదాత

బెంగళూరు, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడానికి ఏర్పాటయిన సహకార సంఘాలు నష్టాల బాట పడుతున్నాయి. నిధులు లేక ఖాళీ ఖజానాతో రోజులు గడుపుతున్నాయి. దీంతో అప్పులు రాక అన్నదాత విలవిల లాడుతున్నాడు. ఐదు దశాబ్దాల కిందట దేశమంతటా వస్తుమార్పిడి అధికంగా ఉండేది. అప్పట్లో నగదు లావాదేవీలు కష్టతరంగా ఉండేవి. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పంటలసాగు, ఇతరత్రా అవసరాలకు నగదును సమకూర్చుకోవడం ఓ సవాల్‌గా ఉండేది. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రాంతాలవారీగా సహకార సంఘాలు ఏర్పడ్డాయి. దక్షిణభారత్‌లో పరిశీలిస్తే కర్ణాటకలోనే సహకార సంఘాలు ఆశాజనకంగా సాగుతున్నాయి. మిగిలిన రాష్ట్రాలలోనూ సహకారసంఘాలు ఉన్నా కాలానుగుణంగా రాజకీయ పెద్దరికం తమవారికే పదవులు అనేలా ఆలోచనలు మారడంతో భారీ సంఖ్యలో సహకార సంఘాలు దారి తప్పాయి. కర్ణాటకలో సహకారసంఘాలతోపాటు పేరొందిన జాతీయ బ్యాంకులు పుట్టుకొచ్చాయి. ఇలా రాష్ట్రంలోనే శ్రీకారం చుట్టిన బ్యాంకులు వాటికి అనుబంధంగా సహకార సంఘాలను, ప్రాథమిక రైతు సేవా సహకార సంఘాలకు చేదోడుగా నిలిచాయి. బెంగళూరులో నాలుగైదు సహకార సంఘాలు వేలకోట్ల రూపాయలు మోసం చేసినా రాష్ట్రంలోని వేలాది సహకారబ్యాంకులు ఆశాజనకంగానే ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 43వేలకుపైగా సహకారసంఘాలు ఉన్నాయి. 28,516 సహకారసంఘాలు లాభాల బాటలో నడుస్తున్నాయి. 14,670 సహకార సంఘాలు నష్టంలో కొనసాగుతున్నాయి. వీటిలోనే 2,200 పాల ఉత్పత్తిదారుల సహకారసంఘాలు కూడా ఉన్నాయి. సహకారసంఘాలు నష్టాలబాట పట్టేందుకు ప్రధాన కారణం సకాలంలో రుణాలు వసూలు చేయకపోవడమే కారణంగా భావిస్తున్నారు. ఏళ్ల తరబడి రుణాలను వసూలు చేయకుండా కేవలం రెన్యువల్ ద్వారా పాత అప్పును కొత్తగా మారుస్తుండడం కూడా నష్టానికి కారణమవుతోంది. ఓ రైతు పంటల సాగు లేదా అవసరాలకు యంత్రాలు, ఇతరత్రా కొనుగోళ్లకు రుణం తీసుకుంటారు. ఏడాదిలోగా వాటిని చెల్లించాల్సి ఉంటుంది. పంటరుణం బకాయి ఉంటేనే పంటల బీమాతోపాటు నష్టాలు వర్తిస్తాయనే కారణంతో సహకారసంఘాలే కాకుండా జాతీయబ్యాంకులు సైతం రెన్యువల్ చేస్తున్నాయి. ఇలా రెన్యువల్ ద్వారా బ్యాంకుకు వచ్చే లాభం ఏమీ ఉండదు. ఏటా రుణాల మంజూరు మొత్తం పెరుగుతుంటోంది. కొన్నేళ్లపాటు రెన్యువల్ ద్వారానే సాగే రుణాలకు ఎక్కడైనా బ్రేక్ పడితే అది మొండిబకాయిగా మారిపోతుంది.

తారస్థాయికి అవినీతి

సహకారసంఘాల్లో అవినీతి తారస్థాయికి చేరేందుకు పాలకవర్గంలో రాజకీయంతోపాటు పర్యవేక్షించాల్సిన అధికారులు తగినంత మంది లేకపోవడం కూడా కారణాలు ఉన్నాయి. రాష్ట్రంలో 126 మంది సీనియర్ కో-ఆపరేటివ్ ఆఫీసర్‌లు, 403మంది వివిధ కేడర్‌ల అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కిందిస్థాయిలో పనిచేసే వారే ఇన్‌చార్జ్‌లుగా మేనేజర్‌లు సూపరింటెంట్‌లు, అంతకంటే ఎక్కువహోదాలకు వెళ్లిపోతున్నారు. సకాలంలో సహకార సంఘాలలో కీలక అధికారుల పోస్టుల భర్తీతోపాటు సేల్స్ ఆఫీసర్, ఫీల్డ్ ఆఫీసర్ వంటి పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 7,074 తాకట్టు పెట్టుకునే లైసెన్స్ కల్గినవారు వ్యాపారం చేస్తున్నారు. ఇక 1468 చిట్‌ఫండ్ సంస్థలు రిజిస్టర్ అయ్యాయి. వీటిపై నిరంతర నిఘా ఉండాల్సిన అవసరం ఉంది. తాజాగా సహకారసంఘాలపై సమీక్ష జరిపిన సీఎం బకాయి రుణాలను వసూలు చేసేందుకు చొరవ చూపాలని ఆదేశించారు.



మండ్య జిల్లాలో సహకార సంఘం కార్యాలయం

ప్రైవేటు అప్పులతో కుదేలవుతున్న రైతులు

ఈ ఏడాది 37లక్షలమంది రైతులకు 28వేలకోట్ల రూపాయలు పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జూలై ఆఖరుదాకా 8.69 లక్షలమందికి రూ.8.36 లక్షల కోట్లు పంటరుణాలు అందించారు. 2024-25లో 29,75,598మంది రైతులకు 25,93,909 కోట్ల రూపాయల పంట రుణాలు ఇచ్చారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నబార్డు 5,600 కోట్ల రూపాయలు రుణాల లక్ష్యంగా అందులో 3,236 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. నబార్డు రుణంలో 42.21శాతం లోటు ఏర్పడ్డంతో సహకారసంఘాలు ఒక్కసారిగా డోలాయమానంలో పడ్డాయి. దేశవ్యాప్తంగా నాబార్డు సహకార సంఘాలకు ఇచ్చే రుణంలో కోత విధించినట్లు తెలుస్తోంది. నాబార్డు పూర్తిస్థాయిలో సహకారసంఘాలకు రుణాల మొత్తం విడుదల చేస్తే సహకార సంఘాలు రైతులకు అదే స్థాయిలో రుణాలు ఇవ్వనున్నాయి. లేనిపక్షంలో ముందుగా వచ్చేవారికి మాత్రమే రుణాలు సాధ్యం కానున్నాయి. పరోక్షంగా ఈ ప్రక్రియలో రైతులకు నష్టం కలిగింది. సహకారాన్ని నమ్ముకున్న అన్నదాతలకు మొండిచేయి మిగలడంతో సకాలంలో పంటలసాగు, ఇతరత్రా అవసరాలకోసం అత్యంత సులభతరంగా రుణాలు పొందేందుకు వడ్డీ వ్యాపారులు, మైక్రోఫైనాన్స్, లోన్‌యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. బంగారం తాకట్టు పెట్టి ఇతోధికంగా రుణాలు తీసుకున్నారు. ఇక సాధ్యం కాదని భావించినవారు బంగారాన్ని ఏకంగా విక్రయించినవారు కూడా ఉన్నారు.


ర్యాలీలో రాహుల్‌గాంధీ, సీఎం సిద్దరామయ్య

బిహార్ ఓట్ అధికార్ ర్యాలీలో సీఎం

బెంగళూరు, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): బిహార్‌లో జరుగుతున్న ఓట్ అధికార్ ర్యాలీలో సీఎం సిద్దరామయ్య పాల్గొన్నారు. లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ బిహార్‌లో నిరంతరంగా ఓట్ అధికార్ ర్యాలీలు జరుపుతున్నారు. ఇటీవలే డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు ఓ బృందం పాల్గొంది. తాజాగా శుక్రవారం సీఎం సిద్దరామయ్య, మంత్రులు పరమేశ్వర్, సతీశ్‌జార్కిహొళి, జమీర్ అహ్మద్, డాక్టర్ సుధాకర్, సీనియర్ నేత బీకే హరిప్రసాద్‌లతో కలసి ప్రత్యేక విమానంలో బయల్దేరారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ విమానాశ్రయం చేరుకుని అక్కడనుంచి రోడ్డుమార్గాన బిహార్ రాష్ట్రం గోపాల్‌గంజ్‌కు చేరుకున్నారు. రాహుల్‌తో కలసి ర్యాలీలో భాగస్వాములయ్యారు.


వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న ఉపలోకాయుక్త వీరప్ప

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం శిక్షార్హం

- రాష్ట్రవ్యాప్తంగా 25 వేల ఫిర్యాదులు పెండింగ్ : ఉప లోకాయుక్త వీరప్ప

(వివరాలు7లో)

జీఎస్టీలో మార్పులతో తగ్గనున్న రాష్ట్రాల ఆదాయం

- ఢిల్లీలో మంత్రి కృష్ణబైరేగౌడ


ఢిల్లీలో ఇతర రాష్ట్రాల ప్రతినిధులతో మంత్రి కృష్ణబైరేగౌడ

బెంగళూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ పన్ను సరళీకృతం చేయడం ద్వారా రాష్ట్రాల ఆదాయంలో నష్టం కలగనుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో శుక్రవారం ఎన్డీయేతర పాలనలు సాగిస్తున్న రాష్ట్రాల ప్రత్యేక సమావేశం జరిగింది. కర్ణాటక తరపున రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ పాల్గొన్నారు. హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, కేరళ, తమిళనాడు, పంజాబ్, తెలంగాణ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల మంత్రులు, ప్రతినిధులు భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కృష్ణబైరేగౌడ ప్రస్తావనలో రాష్ట్రాల సంక్షేమాన్ని కాపాడేదిశగా కేంద్రం జీఎస్టీని వ్యవస్థీకరించాలన్నారు. జీఎస్టీలో మార్పులు చేస్తే రాష్ట్రాలకు పన్నులవాటా తగ్గనుందన్నారు. దేశవ్యాప్తంగా ఏకీకృత పరోక్షపన్నును తీసుకొచ్చే వ్యవస్థ జీఎస్టీని 2017లో ప్రారంభించారన్నారు. ప్రస్తుతం మార్పులు చేస్తే రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని ప్రస్తావించారు.


చర్చి బయట భక్తులు

7

మేరీమాత ఉత్సవాలు ప్రారంభం

సార్..మారరు..!

- తీరుమారని ప్రభుత్వ అధికారులు ● లంచం ఇవ్వకుంటే జరగని పనులు
- సామాన్యులనూ వదలరు.. ● లోకాయుక్తను ఆశ్రయిస్తున్న బాధితులు



బళ్లారి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మంచి సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాలు అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారాయి. రూ. వేళ్ల, లక్షల కొద్దీ జీతాలు పొందుతూ ప్రజలకు సహకరించాల్సిన అధికారులు కొందరు అక్రమ సంపాదనకు పూనుకున్నారు. ఫలితం ప్రజలు లంచాలు ఇచ్చుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి పనికీ ఒకరేటు కట్టి అధికారులు లంచం తీసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. లంచం పొందుతున్న అధికారులను మందలించి ప్రజల పక్షం నిలవాల్సిన పాలకులూ మౌనంగానే ఉండడం పలు అనుమానాలకు తెర తీస్తోంది. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో కొంత నీతినిజాయితీగా పనిచేస్తున్నా పూర్తిస్థాయి అవినీతి అధికారులు ఆధాయ మార్గాలే పట్టారని సామాన్యులు వాపోతున్నారు.

బళ్లారి జిల్లాలోని బుడా, నగరపాలికె, రిజిస్ట్రార్, పోలీస్టేషన్, రెవెన్యూ ఇలా అన్ని ప్రధాన కార్యాలయాల్లో లంచావతారం పెరిగిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో డబ్బులు ఇచ్చిన వారి పనులు చకచకా జరిగిపోతుంటే, ఇవ్వలేని వారు మాత్రం దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. దీంతో కొందరు బాధితులు లంచం అడిగినంత ఇచ్చుకోలేక ఏకంగా లోకాయుక్తనే ఆశ్రయిస్తున్నారు.

- రెండు నెలల క్రితం బుడాలో లౌ-ఓట్లు అనుమతికి ఏకంగా అధికారి పెద్ద మొత్తంలో లంచం అడిగాడని ఒక బాధితుడు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీంతో లోకాయుక్త అధికారులు బుడా కార్యాలయం పై దాడి చేసి లంచం తీసుకుంటున్న కమీషనర్ రమేష్ తో పాటు 12 మందిని అరెస్టు చేశారు.
- విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో జెస్కాం అధికారి లంచడం అడుగుతున్నాడని ఓ రైతు ఫిర్యాదు చేడయంతో జేస్కాం అధికారిని లోకాయుక్త అధికారులు అరెస్టు చేశారు.
- ఇటీవల బళ్లారి నగర పాలికెలో తన పొలంలో ప్లాటు వేసి రోడ్డు అప్రూవల్ కోసం అనుమతి కోరితే నగర పాలికెలో సంబంధిత శాఖ అధికారి రూ. 16 లక్షలు డిమాండ్ చేశాడని ప్రకాష్‌రావు అనే వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త అధికారులు నగరపాలికె కార్యాలయం పై దాడి చేసి సంబంధిత శాఖ అధికారులను పట్టుకునే లోపే వారు అక్కడినుంచి పరారయ్యారు. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇష్టానుసారం ఫీజులు వసూళ్ల చేస్తున్నారని లోకాయుక్తకు ఓ రైతు ఫిర్యాదు చేశారు. ఇలా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి తాండవిస్తుంది. ఏపని చేయాలన్నా లంచం తీసుకోలేనిదే ఏ ఫైలూ ముందుకు కదలం లేదనే విమర్శలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి పై ప్రతిపక్ష నాయకులు, ప్రజాసంఘాలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు తీవ్రంగా మండిపడుతున్నాయి. బీజేపీ నాయకులు . జేడీఎస్ నాయకులు ప్రభ్వు కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి లంచగొండి తనం పూర్తీ స్థాయిలో అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు. కొందరు దర్నాలూ చేస్తున్నారు. గతరెండు రోజుల క్రితం బుడా మాజీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి బుడాలో జరుగుతున్న అవినీతి పై ప్రెస్‌మీట్‌లో ఎత్తిచూపారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి వివిద ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాల పై తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంఎం, సీపీఐ, ఏఐడీఎస్‌వో లాంటి సంఘాలు ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి పై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.అధికార ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిపై మౌనంగా ఉండడం వెనుక వీరి పాత్ర ఏమిటీ అని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రభుత్వ కార్యాలయల్లో అవినీతి, లంచగొండి తనం సాగుతుండంతో దీనిని అరికట్టాలని, ప్రభుత్వం అధికారులపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు.

ధర్మాధికారి వీరేంద్ర హెగ్డేకు

జైన గురువుల సంపూర్ణ మద్దతు

- ధర్మస్థలపై కుట్ర బహిర్గతమైందన్న స్వామీజీలు


వేదికపై జైన గురువులు

బెంగళూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్రహెగ్డేకు జైన గురువులు సంపూర్ణమద్దతు ప్రకటించారు. శుక్రవారం ధర్మస్థలలో రాష్ట్రపరిధిలోని జైన గురువులు ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రావణబెళగొళ చారుకీర్తి భట్టారక స్వామీజీ మాట్లాడుతూ హెగ్డే కుటుంబీకులంతా త్యాగ పరంపరతో సేవలు అందిస్తున్నారన్నారు. దర్మస్థల గౌరవాన్ని కాపాడేందుకు అందరూ కట్టుబడి ఉండాలన్నారు. దర్మస్థలపై ఆరోపణలు వచ్చాయని అయితే వాటివెనుక ఉండే కుట్ర విచారణ ద్వారా బహిరంగమైందన్నారు. ధర్మాధికారి కుటుంబం జైన సంప్రదాయానికి చెందినవారనే కుట్ర జరిగిందన్నారు. దేవాలయ అధికారాన్ని దక్కించుకునేందుకు ఇలాంటి కుయుక్తులు పన్నారన్నారు. హిందూ, జైనులను విభజించడం సాధ్యం కాదని ప్రకటించారు. శాంతిని కాపాడేదిశగా ఓపికతో ఉండాలని పిలుపునిచ్చారు. జైన గురువులు ధర్మాధికారికి సంపూర్ణమద్దతు ప్రకటించారు.

అబద్ధాలు చెప్పేందుకు సుపారీ

చన్నయ్య వ్యాఖ్యలతో డోలాయమానంలో తిమరోడి బృందం పడినట్లయ్యింది. దర్మస్థలలో వందలాది మృతదేహాలు పాతిపెట్టానని చెప్పిన చన్నయ్య సిట్ విచారణలో పలు వాస్తవాలు వెల్లడించారు. ధర్మస్థలకు వ్యతిరేకంగా చెబితే రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు సిట్ అధికారుల ముందు చన్నయ్య అంగీకరించినట్లు సమాచారం. దీంతో వ్యతిరేక బృందంలోని మహేశ్‌శెట్టి తిమరోడికి షాక్ ఇచ్చినట్టయ్యింది. ఇప్పటికే సుజాతభట్ తన కూతురే లేరని, అనన్యభట్ అనే మెడికల్ విద్యార్థి అనేది కేవలం వారు సూచించినట్టు చెప్పడమేనని తేల్చేశారు. ఇలా ఇద్దరూ వాస్తవాలు తెలపడంతో మహేశ్‌శెట్టి తిమ్మరోడి, గిరీశ్‌మట్టణ్ణవర్, జయంత్, యూట్యూబర్ సమీర్‌లకు వరుసదెబ్బలు తగిలినట్టయ్యింది. మహేశ్‌శెట్టి తిమరోడికి చెందిన రబ్బరుతోట నుంచి తవ్వకాలు జరిపి పుర్రె ఇచ్చారని చన్నయ్య తెలిపిన మేరకు సిట్ పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు రబ్బరుతోటలో పంచనామా చేశారు. తవ్వకాలు జరిపిన స్థలంలో మట్టిని సైతం ఫోరెన్సిక్ నిపుణులు తీసుకెళ్లారు.

వైభవంగా లక్ష్మీగణపతి బ్రహ్మారథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో కురుడుమలె లక్ష్మీగణపతి

ముళబాగిలు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కురుడమలె గ్రామంలో పురాణ ప్రసిద్ధమైన లక్ష్మీగణపతి బ్రహ్మారథోత్సవం వేలాదిమంది భక్తుల నడుమ వైభవంగా జరిగింది. వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా బుధవారం విశేషపూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని గురువారం అలంకరించిన రథంపై కొలువుదీర్చి పురవీధులలో ఊరేగించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలనుంచి విచ్చేసిన భక్తాదులు పూలు, దవనం, అరటిపండు, మిరియాలు రథంపైవేసి మొక్కులు తీర్చుకున్నారు. మూలవిరాట్టును విశేషంగా అలంకరించారు. భక్తులు క్యూలో వచ్చి దర్శనం చేసుకున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ట్రాక్టర్లలో వచ్చి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. బెంగళూరు ఇందిరానగర్‌కు చెందిన జైప్రకాశ్ 25వేల జిలేజి, సుబ్రమణిరెడ్డి భారీసంఖ్యలో లడ్డూలను పంపిణీ చేశారు. దేవదాయశాఖచే అన్నసంతర్పణ సాగింది. ఏసీపీలు హెచ్‌సీ జగదీశ్, సీఆర్ రవికుమార్, మోనిష, సీఐ సతీశ్‌లు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు పర్యవేక్షించారు. భక్తులు పలు ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చారు. మంత్రి మునియప్ప, ఎంపీ మల్లేశ్‌బాబు, ముళబాగిలు ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్, కోలారు ఎమ్మెల్యే జీ మంజునాథ్, ఎమ్మెల్సీ అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నిమజ్జనానికి లోతు చూద్దామని..

● చిత్రావతి నదిలో మునిగి బీటెక్ విద్యార్థి మృతి


హేమంత్‌కుమార్ మృతదేహం

బత్తలపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనానికి చిత్రావతి నది లోతు చూసేందుకు ప్రయత్నించిన బీటెక్ విద్యార్థి అందులో మునిగి మరణించాడు. మండలంలోని సంగమేశ్వరం వద్ద శుక్రవారం చిత్రవతి నదిలో మునిగి బీటెక్ విద్యార్థి హేమంత్ కుమార్ (23) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన శ్రీనివాసులుకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు హేమత్‌కుమార్ బీటెక్ ఫైనలియర్ చదువుతుండేవాడు. హేమంత్ కుమార్.. మిత్రులతో కలిసి కాలనీలో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రతిమను శనివారం నిమజ్జనం చేయాలనున్నారు. సంగమేశ్వరంవద్ద చిత్రావతి నది లోతును పరిశీలించేందుకు మిత్రులతో కలసి హేమంత్ కుమార్ దిగాడు. లోతును పరిశీలిస్తూ కొద్దిదూరం వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండడంతో మునిగి పోశాగాడు. గట్టిగా కేకలు వేశాడు. వెంటనే మిత్రులు తమ టీషర్టులను కలిపి, కాపాడే ప్రయత్నం చేశారు. అయినా హేమంత్ మునిగిపోయాడు. చుటుపక్కల వారి సాయంతో హేమంత్‌కుమార్‌ను బయటకు తీసి, బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. కుటుంబీకులు ఆస్పత్రికి చేరుకుని, బోరున విలపించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

10 రోజుల తర్వాత మృతదేహం లభ్యం


బత్తల పవన్ (ఫైల్)

బొమ్మనహాళ్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)లో పది రోజుల క్రితం గల్లంతైన యువకుడి మృతదేహం జిల్లాలో శుక్రవారం లభ్యమైంది. కర్ణాటక రాష్ట్రంలోని కుడితిని ఠాణా పరిధి తిమ్మలాపురం గ్రామ సమీపాన హెచ్చెల్సీలో ఈనెల 19న బత్తల పవన్ (22) గల్లంతయ్యాడు. అతడి మృతదేహం మండలంలోని దేవగిరి క్రాస్ వద్ద లభ్యమైంది. బంధవులు, హెడ్ కానిస్టేబుల్ నరేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన బత్తల పవన్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. లారీ పని మీద కర్ణాటకకు వెళ్లాడు. ఈ 19న కుడితిని ఠాణా పరిధిలోని తిమ్మలాపురం గ్రామ సమీపాన హెచ్చెల్సీలోకి ఈత కోసం వెళ్లాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. శుక్రవారం మండలంలోని దేవగిరి క్రాస్ వద్ద డిస్ట్రిబ్యూటరీలో శవమై కనిపించాడు. స్థానికులు.. బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక పోలీసులు ఆరాతీయగా కుడితిని పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలిసింది. సమాచారం ఇవ్వడంతో కుడుతిని పోలీసులు వచ్చి, శవాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. పవన్ తండ్రి పెద్దరాజు ఫిర్యాదు మేరకు కుడితిని పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారిస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

గుమ్మఘట్ట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 వీరాపురం గ్రామంలో శుక్రవారం పురుగుల మందు తాగి ముద్దులాపురం లక్ష్మి(30) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈమెకు 12 కిందట లింగప్పతో వివాహం జరిగింది. సంతానం లేకపోవడంతో తరచూ మథనపడేది. ఈక్రమంలో నే తీవ్ర మనస్తాపంతో ఇంట్లో ఉన్న పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పీఆర్ ఎస్ఈగా చిన్న సుబ్బరాయుడు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈగా చిన్న సుబ్బరాయుడును నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పల్నాడు జిల్లాలో పీఆర్ విభాగంలో ఈఈగా పని చేస్తున్న ఆయన్ను ప్రమోషన్‌పై అనంతపురం ఎస్ఈగా నియమించా రు. జూన్ ఆఖరులో అప్పటి ఎస్ఈ జహీర్ అస్లాం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఈఈగా ఉన్న ప్రభాకర్‌రెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. క్లియర్ వేకెన్సీ ఉండటంతో ప్రమోషన్ కల్పించారు. కర్నూలు జిల్లాకు చెందిన చిన్న సుబ్బరాయుడు అక్కడే పీఆర్ విభాగంలో ఎక్కువ కాలం పని చేశారు. ఆయన వచ్చేనెల 3న ఎస్ఈగా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

డీఐఓ బాధ్యతల స్వీకరణ


డీఐఓ దావూద్‌ను అభినందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉర్దూ టీచర్లు

అనంతపురం విద్య, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఉర్దూ మీడియం పర్యవేక్షణకు డీఐఓగా నియమితుడైన దావూద్ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఉన్న ఆఫీస్‌లో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఏపీటీఎఫ్ నాయకులు దావూద్‌ను కలిసి సత్కరించారు. ఉర్దూమీడియం అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, నాయకులు సర్దార్‌వలి, రమణ, సోహెల్, మన్సూర్, బాబ్జాన్, రజాక్, అమీనుద్దీన్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సీనియర్ టెన్నికాయిట్ ఎంపిక పోటీలు ఈనెల 31వ తేదీన స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి రంగస్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరు 13వ తేదీన బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి, అర్హత గల వారు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. వివరాలకు 9652117133, 8179819416 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సార్ చేతులెత్తి మొక్కుతాం.. న్యాయం చేయండి

విడపనకల్లు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): 'సార్..! మీకు చేతులెత్తి మొక్కుతాం. మాకు న్యాయం చేయండి. మేం పండించిన పంటలను వ్యాపారులు, దళారులు న్యాయంగా కొనేలా చర్యలు తీసుకోండి' అంటూ తూనికలు కొలతలు అధికారి శంకర్‌ను మండలంలోని పాల్తూరు రైతులు కోరారు. గ్రామంలో వేరుశనగ తూకాల్లో బాదు పేరిట జరు గుతున్న మోసంపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ఓ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన జాయింట్ కలెక్టర్ తూనికలు కొలతల శాఖ అధికారులను పాల్తూరు గ్రామానికి పంపారు. దీంతో తూనికలు కొలతలశాఖ అధికారులు శుక్రవారం ఉదయం పాల్తూరు గ్రామం చేరుకుని రైతులతో చర్చించారు. వ్యాపారులను పిలిపించి ఎక్కడైనా సరే 40 కిలోల బస్తాకు 2 కిలోలకు మించి బాదును తీసుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లారీలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మారయ్య పొలంలో ఓ వ్యాపారి 43.5 కిలోల తూకం పట్టిన విషయాన్ని గమనించిన అధికారి తిరిగి వాటిని 42 కిలోలకు మార్పించారు. వేరుశనగ కాయలు వేస్తున్న ఖాళీ బ్యాగులు ఉల్లిగడ్డలు వేసే బ్యాగులు కావటంతో కనీసం 10 గ్రాములు కూడా లేని సంచికి అరకిలో బాదు తీయటం ఏంటి అని వ్యాపారులను ప్రశ్నించారు. రైతుల పొలాలు వద్దకే తూనికలు కొలతలశాఖ అధికారులు వెళ్లి ఏ వ్యాపారి వచ్చినా 42కిలోలకు ఒక్క కిలో కూడా ఎక్కువ ఇవ్వద్దు అని సూచించారు. ఎవరైనా అధికంగా డిమాండ్ చేస్తే తమకు ఫోన్ చేయమని నంబర్లను ఇచ్చారు. 'వర్షాలు పడుతున్నాయి. పొలాల్లోనే రాశులు వేసుకున్నాము. దిగుబడి తడిస్తే నష్టపోతాము. ప్రభుత్వం తరఫున వేరుశనగ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోండి' అంటూ పలువురు రైతులు వేడుకున్నారు.

పారా కోర్సులతో మెండైన ఉపాధి

● రెండేళ్ల డిప్లొమాతో అవకాశం

● కోర్సుల ప్రవేశాలకు నోటిఫికేషన్



అనంతపురం వైద్యం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖ అనుబంధంగా ఆరోగ్య సంరక్షణకు వివిధ రూపాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తున్నాయి. వాటిని సొంతం చేసుకోవాలంటే పారా మెడికల్ సైన్స్ కోర్సులను అభ్యసించాలి. వాటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అనుబంధ, ఆరోగ్య సంరక్షణ వృత్తుల మండలి(ఏపీఎస్ఏహెచ్‌పీసీ) డిప్లొమా కోర్సుల రూపంలో అందిస్తోంది. రెండేళ్ల వ్యవధిగల కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. ఏపీఎస్ఏహెచ్‌పీసీ అనుబంధంగా ప్రభుత్వ వైద్య కళాశాల డిప్లొమా కోర్సులను అందిస్తోంది. ఇంటర్మీడియట్ బైపీసీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు నోటిఫికేషన్ జారీచేశారు.

సీట్ల కేటాయింపు వివరాలు...

కోర్సు పేరు	సీట్లు
డీఎంఎల్‌టీ	30
డీఓఏ	10
డీఏఎన్ఎస్	30
డీఎంఐటీ	30
డీఈసీజీ	10
డీఆర్‌జీఏ	10
డీఆర్ఏ	10
డీఎంఎస్‌టీ	15
మొత్తం	145

రెండేళ్ల కోర్సులు

ఏపీఎస్ఏహెచ్‌పీసీ ఆధ్వర్యంలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ), ఆప్తాల్మిక్ అసిస్టెంట్(ఓఏ), అనస్తీషియా టెక్నీషియన్(ఏఎన్ఎస్), మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్(ఎంఐటీ), ఈసీజీ టెక్నీషియన్(ఈసీజీ), రేడియో గ్రాఫిక్ అసిస్టెంట్(ఆర్జీఏ), డార్క్‌రూమ్ అసిస్టెంట్(డీఆర్ఏ), మెడికల్ స్టెరిలేజేషన్ మేనేజ్‌మెంట్ స్టాఫ్(ఎంఎస్‌టీ) తదితర కోర్సులను అందిస్తోంది. రెండేళ్ల డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు వైద్యశాఖలో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లోని ఆపరేషన్ థియేటర్లు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు, నేత్ర పరీక్షల విభాగం తదితర విభాగాల్లో ఉపాధి లభిస్తుందని వివరిస్తున్నాయి.

8 వరకు దరఖాస్తులు



పారామెడికల్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు సెప్టెంబరు 8 వరకు ఉంది. ఇంటర్మీడియేట్‌లో బైపీసీ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులు. https://ananthapuramu.ap.gov.in/ వెబ్‌పోర్టల్ ద్వారా దరఖాస్తును డౌన్ చేసుకోవాలి. పూర్తి చేసిన దరఖాస్తుకు, అర్హత ధ్రువపత్రాలు జతపరచాలి. వాటిని వైద్య కళాశాలలో అందజేయాలి.

-ప్రొఫెసర్ షారోన్ సోనియా, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

ఆంధ్రా అండర్-19 క్రికెట్ జట్టుకు జయంత్


జయంత్ కృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-19 క్రికెట్ జట్టులో జిల్లాకు చెందిన జయంత్‌కృష్ణ చోటు దక్కించుకున్నాడు. శనివారం నుంచి గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించే జాతీయ టోర్నీలో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన జయంత్‌కృష్ణను పలువురు అభినందించారు.

అక్రెడిటేషన్ గడువు పొడిగింపు

అనంతపురం కలెక్టరేట్, పుట్టపర్తి రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల గడువును మరో మూడు నెలలు పొడిగించారు. ఈ మేరకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీ చేశారని కలెక్టర్ వినోద్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా డీపీఆర్ఓ వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి నవంబరు 30 వరకూ గడువు పొడిగిస్తామని వారు తెలిపారు. తమ సంస్థలలో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలను జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి కార్యాలయాలలో యాజమాన్యం అందజేయాలని కోరారు.

ఓరి.. నాయనో..!

● ఇంకా 50మందికిరాని మెసేజ్‌లు

● పారదర్శకత పేరుతో అభ్యర్థులతో ఆటలు

● రెండోరోజు కొనసాగిన సర్టిఫికెట్ల పరిశీలన

● మూడురోజులైనా పూర్తిస్థాయిలో రాని డీఎస్సీ ఎంపిక జాబితా


రెండోరోజు పీవీకేకేలో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం విద్య, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాల ప్రక్రియలో రాష్ట్రశాఖ కొత్తగా అమలు చేస్తున్న నిబంధనలు అభ్యర్థులను అయోమయంలోకి నెడుతున్నాయి. గతంలో డీఎస్సీ ఎంపిక జాబితాను మెరిట్, రోస్టర్ ఆధారంగా అభ్యర్థులను కూర్చోబెట్టి జిల్లాస్థాయిలో విద్యాశాఖ ఒకేసారి విడుదల చేసేది. ఆ తర్వాత సర్టిఫికెట్ల పరిశీలన చేసేవారు. అందులో ఏమైనా తేడాలుంటే వారిని జాబితా నుంచి తప్పించి, ఆ తర్వాతి స్థానంలో ఉన్న అదే రోస్టర్ పాయింట్ అభ్యర్థికి మెరిట్ ఆధారంగా కూర్చోబెట్టేవారు. ఇపుడు డీఎస్సీ సెలెక్షన్ లిస్టు మొత్తం రాష్ట్రశాఖ నుంచే తయారుచేసి పంపుతున్నారు. అదికూడా ఒకేసారి కాకుండా రోజుకు కొన్ని పంపిస్తుండడంతో అభ్యర్థుల్లో అయోమయం, ఆందోళన నెలకొన్నాయి. అనంత జిల్లాకు 807 టీచర్ పోస్టులకు జాబితా పంపాల్సి ఉంది. మూడురోజులైనా పూర్తిస్థాయి జాబితా రాలేదు. తొలిరోజు జిల్లాలో 625 మంది అభ్యర్థులకు సెలెక్టల జాబితాలో ఉన్నట్లు మెసేజ్‌లు రాష్ట్రశాఖ నుంచి పంపారు. వీరందరికీ గురువారం జిల్లాకేంద్రంలోని పీవీకేకే కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతున్నారు. గురువారం మరో 132 మందికి మెసేజ్‌లు పంపారు. వారికి శుక్రవారం సర్టిపికెట్ల పరిశీలన చేపట్టారు. ఈలెక్కన ఇంకా జిల్లాలో 50 మంది అభ్యర్థులకు శుక్రవారం రాత్రి వరకు మెసేజ్‌లు రాలేదు. దీంతో మెసేజ్‌లు వస్తాయా, రావా? అని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. కొందరైతే మిగిలిన వారికి ఎప్పుడు మెసేజ్‌లు వస్తాయోనని సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రానికి వచ్చి విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులను ప్రాధేయపడుతున్నారు. విద్యాశాఖ అధికారులు సైతం వీటిపై క్లారిటీ ఇవ్వట్లేదు. మెసేజ్‌లు వస్తాయని చెప్పి పంపుతున్నారు. మొత్తంమీద పారదర్శకత పేరుతో రాష్ట్ర అధికారులు.. డీఎస్సీ అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు.

కొనసాగిన పరిశీలన

డీఎస్సీ సెలెక్ట్‌లిస్టులో ఉన్న అభ్యర్థులకు రాష్ట్రశాఖ మెసేజ్‌లు పంపిస్తోంది. అలా జిల్లాలో రెండురోజుల్లో 757 మందికి మెసేజ్‌లు వచ్చినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. వీరిలో గురు, శుక్రవారాల్లో 748 మంది సర్టిపికెట్ల పరిశీలనకు హాజరయ్యారనీ, 9 మంది రాలేదన్నారు. ఈగైర్హాజరైన వారిలో కొందరు వచ్చినా వారి సర్టిఫికెట్లలో తేడాలు ఉండడంతో తీసుకురావడానికి కొందరు వెళ్లారన్నారు. మరికొందరు సమాచారం తెలీక రాలేదనీ, అలాంటి వారికి ఫోన్లు చేసి, సమాచారం ఇచ్చి పిలిపించుకుంటున్నామని డీఈఓ తెలిపారు. ఎంపిక జాబితాలో ఉన్న వారందరికీ సమాచారం ఇచ్చి, సర్టిఫికెట్ల పరిశీలనకు అవకాశం కల్పిస్తున్నామన్నారు మిగిలిన 50మంది అభ్యర్థులకు శనివారం ఉదయంలోగా మెసేజ్‌లు వచ్చే అవకాశం ఉందనీ, రాగానే వారు పీవీకేకే కాలేజీకి వచ్చి సర్టిఫికెట్లను పరిశీలించుకోవాల్సి ఉంటుందని డీఈఓ వివరించారు.

క్రీడాకారులు రైల్వే సౌకర్యాలను వినియోగించుకోవాలి

● డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రైల్వే అందజేస్తున్న క్రీడా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఆటగాళ్లు తమ ప్రతిభా పాటవాలను మెరుగుపరచుకోవాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించా రు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్ఎం మాట్లాడుతూ రైల్వే శాఖ ప్రజా సేవతోపాటు, క్రీడాభివృద్ధికి ఎంతో తోడ్పడుతోందన్నారు. అధునాతనమైన రైల్వే గ్రౌండు, ప్రాక్టీస్ పిచ్‌లు, జిమ్ తదితర సదుపాయాలను వినియోగించుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక రైల్వే గ్రౌండులో రైల్వేలోని వివిధ శాఖల ఉద్యోగులు క్రికెట్‌ను ఆడారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాచిగూడ-తిరుపతి మధ్య ప్రత్యేక రైలు

గుంతకల్లు(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కాచిగూడ-తిరుపతి మధ్య (వయా గుంతకల్లు) ఈ నెల 29, 30 తేదీల్లో ఓ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కాచిగూడ-తిరుపతి (02794) ప్రత్యేక రైలు ఈ నెల 29న రాత్రి 11 గంటలకు కాచిగూడలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1 గంటకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (02793) 30న రాత్రి 9-10 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు కాచిగూడకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, తాడిపత్రి, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

బిలాస్‌పూర్-యల్హంక మధ్య..

దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సెప్టెంబరు 9 నుంచి నవంబరు 19 వరకూ బిలాస్‌పూర్-యల్హంక (వయా గుంతకల్లు) మధ్య ఓ ప్రత్యేక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బిలాస్‌పూర్-యల్హంక ప్రత్యేక రైలు (08261) సెప్టెంబరు 9 నుంచి నవంబరు 18 వరకూ ప్రతి మంగళవారం ఉదయం 11 గంటలకు బిలాస్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 7 గంటలకు యల్హంకకు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (08262) సెప్టెంబరు 10 నుంచి నవంబరు 19 వరకూ ప్రతి బుధవారం ఉదయం రాత్రి 9 గంటలకు యల్హంకలో బయలుదేరి శుక్రవారం ఉదయం ఐదున్నరకు బిలాస్‌పూర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు భటపర, రాయపూర్, దుర్గ్, రాజనంద్‌గావ్, డోంగర్‌ఘర్, గోండియా, వాడ్సా, చందఫోర్ట్, బాలార్షా, సిర్పూర్ కాగజ్ నగర్, మంచిర్యాల, ఖాజీపేట, చర్లపల్లి, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, గుత్తి, అనంతపురం, ధర్మవరం, హిందూపురం స్టేషన్ల మీదుగా యల్హంకకు చేరుతుందన్నారు.

ప్యాసింజరు రైళ్ల రద్దు

కర్ణాటకలోని బళ్లారి, తోరణగల్లు స్టేషన్ యార్డుల్లో జరుగుతున్న ఎలెక్ట్రికల్, సిగ్నలింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్ పనుల వల్ల గుంతకల్లు మీదుగా వెళ్లే పలు ప్యాసింజరు రైళ్లను రద్దు పరచినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు-చిగ్జాజుర్-గుంతకల్లు ప్యాసింజరు (57415/16) రైలును సెప్టెంబరు 3న రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పాక్షికంగా రద్దయిన రైళ్లు

తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు (57405)ను సెప్టెంబరు 2న, దీని తిరుగు ప్రయాణపు రైలు (57405)ను సెప్టెంబరు 3న గుంతకల్లు-కదిరిదేవరపల్లి సెక్షన్‌లో రద్దుపరచి, కేవలం గుంతకల్లు-తిరుపతి మధ్యన నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. హుబ్లి-గుంతకల్లు ప్యాసింజరు (56911) రైలును, దీని తిరుగు ప్రయాణపు రైలు (56912)ను సెప్టెంబరు 3న గుంతకల్లు-మునీరాబాద్ సెక్షన్‌లో రద్దుపరచి, మునీరాబాద్-హుబ్లి సెక్షన్‌లో మాత్రమే నడుపుతామన్నారు. హుబ్లి-తిరుపతి (57402) ప్యాసింజరును సెప్టెంబరు 3న గంటన్నరపాటు ఆలస్యంగా నడపనున్నట్లు వివరించారు.

నాందేడ్-ధర్మవరం రైలు రద్దు

హైదరాబాద్ రైల్వే డివిజన్‌లో వర్షపు నీరు ట్రాక్‌పై ప్రవహించిన కారణంగా నాందేడ్-ధర్మవరం-నాందేడ్ స్పెషల్ ఫేర్ ఎక్స్‌ప్రెస్‌ను ఒక ట్రిప్పు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాందేడ్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (07189) రైలును 29న దీని తిరుగు ప్రయాణపు రైలు (07190)ను ఈ నెల 31న రద్దుపరచినట్లు తెలియజేశారు.


తెలుగు శాసనాన్ని పరిశీలిస్తున్న మైనాస్వామి, ఉపాధ్యాయులు తదితరులు

1388లోనే అచ్చమైన తెలుగు శాసనం

● విశ్లేషించిన చరిత్రకారుడు మైనాస్వామి

గోరంట్ల, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేరెడ్డిపల్లి సమీప పొలాల్లో 1388లోనే అచ్చమైన తెలుగు భాషలో లిఖించిన శాసనాన్ని చరిత్రకారుడు మైనాస్వామి విశ్లేషించారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన ఉపాధ్యాయులతో కలిసి శాసనంలోని అంశాలను చదివి వినిపించారు. హరిహరరాయల కుమారుడు రెండో బుక్కరాయలు సామాన్య శకం 1388లో మేరెడ్డిపల్లి ప్రజల నీటి అవసరాల కోసం, వ్యవసాయాభివృద్ధికి చెరువులు తవ్వించడం, చిత్రావతి నది నుంచి కాలువలద్వారా నీరు మళ్లించడం విషయాలు చక్కనైన తెలుగులో లిఖించారన్నారు. 1388 నాటికి తెలుగు భాష ఛందోబద్ధమైన పద్యాల రూపంలో గ్రాంధికంలో ఉండేదన్నారు. శాసనంలోని వచనం ఎంతో సరళంగా, అద్భుతమైన గుండ్రని అక్షరాల వరుస క్రమంలో ఉందన్నారు. శాసనంలో వాడిన పదాలను బట్టీ విజయనగర సామ్రాజ్యంలో పెనుకొండ సీమలో తెలుగుభాష తేనెలా మధురంగా ఉండేదనీ, అందుకు ఈ శాసనమే సజీవ సాక్ష్యమన్నారు. రాజులు, కార్యకర్తల పేరుతరువాత గారు అని సంబోధించడం తెలుగుభాషాభివృద్ధికి నిదర్శనమన్నారు. అంతటి గొప్ప తెలుగుభాష రాసిన కర్తపేరు శాసనంలో లేకపోవడం గమనార్హం. పొలాల్లోని శాసనాన్ని మ్యూజియంకు తరలించి భద్రపరచాలని మైనాస్వామి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, పరిశోధకులు శ్రీచరణ్, నాగభూషణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి రూ.95 లక్షల చెక్కు


చెక్కు అందజేస్తున్న అధికారులు

అనంతపురం క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన అగ్నిమాపకశాఖ ఉద్యోగి కుటుంబానికి ఆ శాఖ, బ్యాంకు అధికారులు రూ. 95 లక్షల ప్రమాద బీమా డబ్బుకు సంబంధించిన చెక్కు శుక్రవారం అందించారు. జిల్లా అగ్నిమాపక శాఖలో ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న సుధాకర్ విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో మరణించారు. అయితే అగ్నిమాపకశాఖ తమ ఉద్యోగుల ప్రయోజనార్థం బ్యాంక్ ఆఫ్ బరోడాతో ఎంఓయూ చేసుకుంది. మరణించిన ఉద్యోగి సుధాకర్ తన శాలరీ అకౌంట్ బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులో ఉండటంతో రూ.95 లక్షల క్లెయిమ్ అయ్యింది. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆ బ్యాంకు డీజీఎం ప్రసాద్, ఆర్ఎం అమర్‌నాథ్‌రెడ్డి, సాయినగర్ బ్రాంచ్ మేనేజర్ కిరణ్‌కుమార్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి అసోసియేషన్ సభ్యులు ఉద్యోగి కుటుంబానికి అందించారు.

వాటర్ షెడ్‌తో నీటి సంరక్షణ: ఏపీడీ



జ్ఞాపిక అందుకుంటున్న ఏపీడీ సుధాకర్ రెడ్డి

అనంతపురం అర్బన్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): వాటర్ షెడ్‌తో నీటి సంరక్షణ సాధ్యమని జిల్లాకి చెందిన ఆ పథకం ఏపీడీ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. వాటర్ షెడ్ అభివృద్ధిలో టెక్నాలజీ వినియోగంపై ఢిల్లీలోని ఎన్ఏఎస్‌సీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన జాతీయ సదస్సుకు ఏపీ నుంచి సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. శుక్రవారం రెండో రోజు ఆయన మాట్లాడుతూ.. వాటర్ షెడ్లతో రైతులకు ఎంతో ప్రయోజనం అన్నారు. అనంత జిల్లాతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో వాటర్ షెడ్ల నిర్వహణ తీరును వివరించినట్లు ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో తెలిపారు. ఏపీడీకి సదస్సులో ఉన్నతాధికారులు జ్ఞాపిక అందజేశారు.

షిర్డీసాయి ట్రస్ట్ చైర్‌పర్సన్‌కు నోటీసులు

పెనుకొండ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించారన్న వివాదంలో షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్పకు శుక్రవారం నోటీసులు అందించినట్లు తహసీల్దార్ స్వాతి తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. పెనుకొండ మండలం వాసుదేవపురం రెవెన్యూ పొలంలో షిర్డీసాయి గ్లోబుల్ ట్రస్టు పేరుతో భూములు కొనుగోలుచేశారన్నారు. ఆ భూమి మధ్యలో సర్వే నంబరు 25లో 10.24 ఎకరాల్లో రాళ్లగుట్ట ఉందన్నారు. ఇందులో 7.50 ఎకరాలు ట్రస్టు ఆక్రమించుకుందన్నారు. ఇందులోనే 2.88 ఎకరాలు వెంకటలక్ష్మి నుంచి కొనుగోలు చేసినట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారనీ, అందుకు సంబంధించిన రికార్డులు 15రోజుల్లోపు అందించాలని సూచించామన్నారు. వారు స్పందించకపోవడంతో నోటీసులు పంపామన్నారు. ఐదు రోజుల్లో రెవెన్యూ యాక్ట్ ప్రకారం భూమిని స్వాధీనం చేసుకుంటామని నోటీసులో స్పష్టం చేసినట్లు తహసీల్దార్ వివరించారు.

నేడు బార్ లాటరీ

అనంతలో 19కిగానూ పదింటికే దరఖాస్తులు

శ్రీసత్యసాయిలో 12 బార్లలో ఏడింటికే ఆసక్తి

కలెక్టర్‌ల సమక్షంలో లక్కీ డ్రా ద్వారా కేటాయింపులు

అనంతపురం క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో బార్ లైసెన్సుల కేటాయింపునకు శనివారం లక్కీ డ్రా తీయనున్నారు. రెండు జిల్లాల్లో ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. అనంతపురం జిల్లాలో 19 బార్లకు గానూ పదింటికి మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. తొమ్మిది బార్లకు ఒక్క దరఖాస్తూ రాలేదు. రెండు గీత కులాల బార్లకు కూడా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు గడువు శుక్రవారం ముగిసింది. పది బార్లకు 40, రెండు గీత కులాల బార్లకు 10 కలిపి మొత్తం 50 దరఖాస్తులు వచ్చాయి. జడ్పీ మీటింగ్ హాల్‌లో కలెక్టర్ వినోద్ కుమార్ శనివారం లక్కీ డ్రా తీయనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 12 బార్లకు దరఖాస్తులు పిలవగా ఐదింటికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. హిందూపురం మున్సిపాలిటీలో నాలుగు బార్లకుపిలవగా, మూటింటికి 19 దరఖాస్తులు వచ్చాయి. కదిరిలో మూడు బార్లకుగానూ రెండింటికి 8 దరఖాస్తులు వచ్చాయి. ధర్మవరంలో మూటింటికి గానూ ఒక్క బార్‌కు మాత్రమే నాలుగు దరఖాస్తులు వచ్చాయి. పెనుకొండలో ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు వచ్చాయి. మడకశిరలో ఒకే బార్ కాగా.. ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. హిందూపురంలో గీత కులాలకు కేటాయించిన బార్ అండ్ రెస్టారెంట్‌కు 11 దరఖాస్తులు వచ్చాయి. దీనికి దరఖాస్తు ఫీజు తక్కువ కావడంతో పోటీ పడ్డారు. పుట్టపర్తిలోని సాయి ఆరామంలో శనివారం ఉదయం 9 గంటలకు లాటరీ తీస్తారు. లైసెన్స్ దక్కించుకున్నవారు 15 రోజుల్లోపు బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇస్తారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

జమున (జయంతి)



దక్షిణాది అలనాటి నటి జమున 1936 ఆగస్టు 30న కర్ణాటక రాష్ట్రం హంపిలో జన్మించారు. పెరిగింది ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా దుగ్గిరాలలో. పాఠశాలలోనే నాటకాలపై మక్కువ కలిగిన ఆమె 1952లో సినీరంగానికి ప్రవేశించారు. శాస్త్రీయ సంగీతం, హార్మోనియంలలో శిక్షణ పొందారు. తమిళ, తెలుగు, కన్నడ, హిందీ భాషలలో మూడు దశాబ్దాలలో సుమారు 200 సినిమాలలో నటించారు. పౌరాణిక, జానపద, సాంఘిక ఇలా అన్ని రకాల సినిమాలు ఉన్నాయి. 60, 70 దశకాలలో హీరోయిన్‌గా రాణించారు. రాము, ఏకవీర, మూగనోము, ఆడజన్మ, శ్రీకృష్ణ తులాభారం వంటి సినిమాలు ఎంతో గుర్తింపు తెచ్చాయి. రెండు ఫిల్మ్‌ఫేర్, ఎన్టీఆర్ నేషనల్ అవార్డు, తమిళనాడు రాష్ట్ర గౌరవ ఎంజీఆర్ అవార్డు, 2019లో సంతోషం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వంటి పురస్కారాలు పొందారు. 1990లో రాజమండ్రి నుంచి లోక్‌సభకు పోటీచేసి గెలుపొందారు. తెలుగు ఆర్టిస్ట్ అసో సియేషన్ ఏర్పాటు చేసి పాతికేళ్లపాటు సమాజసేవ కొనసాగించారు. 2023 జనవరి 27న కన్నుమూశారు.

వారెన్ బఫెట్ (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన వ్యాపారవేత్త, పెట్టుబడిదారుడు వారెన్ ఎడ్వర్డ్ బఫెట్ 1930 ఆగస్టు 30న జన్మించారు. బెర్క్‌షైర్ హాత్‌వే సంస్థకు ఛైర్మన్, సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచంలో తొలి పది కుబేరులలో ప్రస్తుతం ఐదో స్థానంలో ఉండగా సమాజసేవల ద్వారా మానవతా వాదిగాను గుర్తింపు పొందారు. 1951 నుంచి ఇప్పటివరకు వాణిజ్యరంగంలో తనదైన సత్తా చాటుకున్నారు. ఆయన సంగీత కారుడు, స్టోరీ టెల్లర్ కూడా. ఫుట్‌బాల్, బ్రిడ్జ్ గేమ్స్‌పై ఆసక్తిగల ఆయన బిల్‌గేట్స్‌తో కలిసి 'ది గివింగ్ ప్లెడ్జ్' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు.

రవిశంకర్ ప్రసాద్ (పుట్టినరోజు)



రవిశంకర్ ప్రసాద్ 1954 ఆగస్టు 30న బీహార్ రాష్ట్రం పాట్నాలో జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది. బీజేపీలో చేరి పలు రాజకీయ హోదాలలో కొనసాగారు. డిజిటల్ టెక్నాలజీ, ఇ-గవర్నమెంట్ విభాగంలో కీలకనేతగా పేరొందారు. పాట్నా నుంచి లోక్‌సభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా వ్యవహరించి గ్రామీణ ప్రాంతాలకు సైతం ఇ-పాలన, డిజిటల్ ఇండియా పథకాలు అందేలా ఎంతో కృషి చేశారు.

త్వరలోనే తెరపైకి బిళి చుక్కి-హళ్ళి హక్కి

బెంగళూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భిన్నమైన కథాంశంతో కన్నడ ప్రేక్షకుల ముందుకు త్వరలోనే బిళిచుక్కి - హళ్ళి హక్కి సినిమా విడుదల చేస్తున్నట్టు దర్శక, నిర్మాత మహేశ్‌గౌడ తెలిపారు. శుక్రవారం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దర్శక, నిర్మాతగానే కాకుండా ముఖ్యపాత్రలో నటించానన్నారు. ఇదో భిన్నమైన పంథాతో సినిమా రూపొందించామన్నారు. ఇప్పటికే పోస్టర్ విడుదల చేశామన్నారు. సమాజంలో విటిలిగో (తొన్ని) చర్మరోగం ఎంతోమందికి బాధిస్తోందన్నారు. ఇదే అంశంపైనే తొలిసారి సినిమా రూపంలో ప్రయోగం చేశామన్నారు. చర్మవ్యాధి చుట్టూ చిత్రవిచిత్రమైన నమ్మకాలతోనే పెద్ద కథ అయ్యిందన్నారు. ఆ సమస్యతో బాధపడేవారి మనోభావాలను తెరపైకి తీసుకొచ్చామన్నారు. నాటక రంగం ప్రముఖులు కాజల్ కుందర్ కవితాపాత్రలో నటిస్తున్నారన్నారు. ప్రముఖ కళాకారులు వీణాసుందర్, జహంగీర్, రవిభట్ వంటి నటులు కీలకపాత్రలో కనిపిస్తారన్నారు.

పింఛన్లపై అవాస్తవాలు నమ్మకండి

లేపాక్షి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ తొలగించిందని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని అటువంటి అవాస్తవాలు నమ్మవద్దని మండల ప్రత్యేక అధికారి సుదర్శన్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరికీ పింఛన్ తొలగించలేదని కేవలం వెరిఫికేషన్ కోసం మాత్రమే పత్రాలను సరిచూసేందుకే నోటీసులు పంపామన్నారు. నోటీసులు వచ్చినవారు అధికారులవద్దకు వచ్చి వారి సరైన సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. గతంలో జారీచేసిన వికలాంగత్వానికి ప్రస్తుతం ఉన్న వికలాంగత్వానికి వ్యత్యాసం ఉంటే పింఛన్ కొంతమేర తగ్గే అవకాశం ఉందితప్ప పూర్తిగా రద్దుచేయలేదన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ఎంపీడీఓ నరసింహ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు యూటీఎఫ్ సమావేశం

పరిగి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలశాఖ తరఫున ఆడిట్ కమిటీ అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి సుల్తాన్ హఫీజ్‌ఖాన్, హనుమంతప్ప ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. కన్వీనర్ మహంతేజ్ మాట్లాడుతూ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సేవామందిరం పరిగి యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో మధ్యంతర కౌన్సిల్ ఏర్పాటు చేశామన్నారు. సత్యసాయిజిల్లా నుంచి అన్ని మండలాల నుంచి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కమ్యూనిటీ వైద్యశాల తనిఖీ

రొళ్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):స్థానిక కమ్యూనిటీ వైద్యశాలను శుక్రవారం ఆసుపత్రి కమిటీ సభ్యుడు రమేష్‌గౌడ్ తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రత, ఓపీ రిజిష్టర్‌లో రోగుల సంఖ్య, అందుబాటులో ఉన్న మందుల వివరాలను సూపరింటెండెంట్ రమేష్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డులోఉన్న రోగులను పలకరించి వారికి అందిస్తున్న చికిత్స గురించి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

బీమా పథకాలపై జాగృతి

బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో..

బొమ్మనహళ్ళి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బన్నేరుఘట్టరోడ్డులోని బిళవారద హళ్ళిలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో శుక్రవారం ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ పేరిట ప్రత్యేక అవగాహన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ సీఈఓ ఐఏఎస్ అధికారి యతీశ్, బన్నేరుఘట్ట గ్రామపంచాయతీ అధ్యక్షుడు మంజునాథ్, రిజర్వుబ్యాంకు రీజనల్ డైరెక్టర్ సోనాలిజెన్‌గుప్త, బీఓబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బినా వాహిద్, కెనరాబ్యాంకు ఈడీ భవేంద్రకుమార్, ఇతర బ్యాంకుల ముఖ్యులు పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాయోజన, ప్రధానమంత్రి సురక్షతా బీమా యోజన, అటల్‌పించను యోజన తదితర వాటిపై జాగృతి కల్పించారు. బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధా శ్యామ్ రాథోడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నామమాత్రపు ప్రీమియంతో పలు రకాల పించనులు ఉన్నాయన్నారు. కాగా బ్యాంకు ఖాతాలలో పొదుపు చేసుకోవాలని, ఇ-కేవైసీ ద్వారా అర్హులైన మహిళలకు పలు పథకాలతోపాటు కొన్ని సబ్సిడీ రుణాలతోపాటు, తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టైలరింగ్, పశువుల పెంపకం తదితర వాటికి స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాల సదుపాయం ఉందన్నారు. ఇదే సందర్భంగా వివిధ సంఘాల సభ్యులకు చెక్కులు పంపిణీ చేశారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

అవయవదానంపై చైతన్యం అవసరం

● ఈ-హెల్త్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్



చర్చాగోష్ఠిలో పాల్గొన్న వైద్యులు తదితరులు

బెంగళూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అవయవదానంపై మరింత చైతన్యం అవసరమని ఈ-హెల్త్ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. గ్లెనిగల్ బీజీఎస్ ఆసుపత్రి ఏర్పాటు చేసిన ట్రీ ఆఫ్ లైఫ్ పేరిట మూడు రోజుల చర్చాగోష్ఠిని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ అవయవదానం అనేది కేవలం వైద్య ప్రక్రియ కాదని, అది మానవత్వ చర్య అన్నారు. ట్రీ ఆఫ్ లైఫ్ పేరిట ప్రజలలో చైతన్యం తీసుకురావాలనే బీజీఎస్ ఆసుపత్రి ప్రముఖుల ఆలోచన సమంజసమైనదన్నారు. ప్రముఖ శాండల్‌వుడ్ దర్శకుడు, నిర్మాత రాజ్‌వర్ధన్ మాట్లాడుతూ తెరపై హీరోలకంటే నిజమైన సాధకులు అవయవదానం చేసేవారన్నారు. గ్లెనిగల్ సీఈఓ జితేంద్ర అరోరాతోపాటు పలువురు పాల్గొన్నారు.

భక్తుల పూజలందుకుంటున్న గణనాథుడు



పూజల్లో మాజీ మంత్రి లింబావళి



భారీ వినాయకుడు

పలు చోట్ల వినాయక చవితి వేడుకలు

మహదేవపుర, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మహదేవపుర నియోజకవర్గంలో ఐటీబీటీ కంపెనీలు పెద్దసంఖ్యలో ఉండి వాటిద్వారా పన్నుల రూపంలో రాష్ట్ర ఖజానాకు ఆదాయం వస్తోందని అయితే కనీసంగా కూడా నియోజకవర్గ అభివృద్ధికి గ్రాంట్లు మంజూరు చేయడం లేదని మాజీ మంత్రి అరవింద లింబావళి అసంతృప్తి వ్యక్తం చేశారు. బిదరహళ్ళిలో మారుతివినాయక కన్నడ యుజనసంఘం ఆధ్వర్యంలో ధర్మస్థళ మంజునాథ స్వామి ఆలయ నమూనా తరహాలో ఈసారి వినాయకమండపాన్ని రూపొందించారు. ఇక్కడి పూజల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మా పన్ను మా హక్కు పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలో నిరసన చేసిందని గుర్తుచేశారు. రాష్ట్రానికి ఎక్కువ ఆదాయం తమ నియోజకవర్గం నుంచి వస్తున్నా గ్రాంట్లు ఇవ్వడం లేదన్నారు. మా పన్ను మా మహదేవపుర నియోజక వర్గ హక్కు పేరిట నిరసన చేస్తామన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు మంచి బుద్ధి ఇవ్వాలని బీరేశ్వరస్వామిని కోరినట్టు తెలిపారు. ఈ సందర్భంగా బీజీ రాజేశ్, హరాడి పిళ్ళప్ప, నటరాజ్ తదితరులు ఉన్నారు.

తాలూకాలో కొలువుదీరిన గణనాథులు

శిడ్లఘట్ట (ఆంధ్రజ్యోతి): పట్టణం తోపాటు శిడ్లఘట్ట తాలూకా వ్యాప్తంగా వినాయక చవితిని పురస్కరించుకుని వినాయక చవితిని పురస్కరించుకుని గణనాథులను కొలువుదీర్చారు. శ్రీరామభజనామందిర అభివృద్ధి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 55వ గణేశ మహోత్సవం సెప్టెంబరు 6వరకు కొనసాగనుంది. ఇంటింటా వినాయకుడిని కొలువుదీర్చగా వివిధ పాఠశాలల ఆధ్వర్యంలోనూ వేడుకలు సాగాయి. ఉత్సవంలో ప్రజలంతా పాల్గొని ఐకమత్యాన్ని చాటుతున్నారు.

లలితా సహస్రనామ పారాయణం

బొమ్మనహళ్ళి (ఆంధ్రజ్యోతి): హెచ్ఎస్ఆర్ లేఅవుట్‌లోని వాజ్‌పేయ్ క్రీడా మైదానంలో వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. సుమంగళిపూజ, కుంకుమార్చన ఇతర ధార్మిక కార్యక్రమాలు సాగాయి. సాయంత్రం 4గంటలనుంచి కార్యక్రమం సాగింది. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు మహారాజగణపతి ఉత్సవ నిర్వాహకులు ఒడిబియ్యం సంప్ర దాయంతో గౌరవించారు. ఈనెల 31వరకు కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులలో ఒకరైన రవి తెలిపారు. సంగీతం, నృత్య పోటీలు ఇతరత్రా ఉంటాయన్నారు. ఉత్సవంలో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోపీనాథరెడ్డి, బీజేపీ నాయకులు ఆనంద రెడ్డి, వేణుగోపాలరెడ్డి, శంకర నారాయణరెడ్డి, హెచ్ఎస్ఆర్ వాసు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి వద్ద భక్తబృందం



ఉత్సవ ముఖ్యులకు సన్మానం



శిడ్లఘట్టలో..

పీయూ కళాశాలలో కొరవడిన స్వచ్ఛత



దళిత సంఘర్ష సమితి సభ్యులు

దొమ్మసంద్ర, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి దొమ్మసంద్ర గ్రామంలోని ప్రభుత్వ స్వతంత్ర పీయూ కళాశాలలో స్వచ్ఛత కొరవడింది. దళిత సంఘర్ష సమితి నేతృత్వంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మునిరాజు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుమారు 15లక్షల రూపాయల ఖర్చుతో కళాశాలకు ప్రహరీగోడ నిర్మించారన్నారు. ఎన్నోఏళ్ల పోరాటం తర్వాత దొమ్మసంద్ర గ్రామంలో ప్రభుత్వ పీయూ కళాశాల ఏర్పాటైందని, 6 ఎకరాల స్థలం మంజూరైందన్నారు. ప్రస్తుతం దీని విలువ రూ.210కోట్లుగా ఉందన్నారు. గ్రామీణప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య లభించాలనే ఉద్దేశ్యంతో ఇక్కడ కళాశాల ఏర్పాటైందన్నారు. పంచాయతీ సభ్యుడు నారాయణప్ప మాట్లాడుతూ కళాశాలకు నీరు సరఫరా చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. కాగా కళాశాల, పాఠశాల సమీపంలో బార్ అండ్ రెస్టారెంట్ లేకుండా చేయాలన్నారు. విద్యార్థులు దుర్వ్యసనాలకు లోనుకాకుండా పర్యవేక్షించాలన్నారు. ఈ సందర్భంగా కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

అంజలి కాన్వెంట్‌కు నైటింగేల్ చాంపియన్ పురస్కారం



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

బెంగళూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): క్లస్టర్‌స్థాయి వాలీబాల్, త్రోబాల్ పోటీలలో రాణించడం ద్వారా అంజలి కాన్వెంట్ విద్యార్థులు నైటింగేల్ హైస్కూల్ చాంపియన్‌లుగా నిలిచారు. శ్రీగంధకావలు క్లస్టర్‌స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. వాలీబాల్‌లో బాలురు, త్రోబాల్‌లో బాలికల జట్టు విజేతగా నిలిచారు. ప్రాథమిక స్థాయిలో బాలికలు విజేతగా నిలిచారు. నాలుగు జట్లు ప్రథమస్థానంలో నిలిచి తాలూకాస్థాయికి ఎంపికయ్యారు. కోచ్‌లు అభిషేక్, హర్ష, మోహిత్‌నాయక్, లిఖిత్, పీఈటీలు రవీంద్ర, తనుజతోపాటు పలువురు పాల్గొన్నారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ ఎస్‌జీ గౌడ, కార్యదర్శి సరళ, ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణగౌడ విజేతజట్లను ప్రత్యేకంగా అభినందించారు.

మేరీమాత ఉత్సవాలు ప్రారంభం

బెంగళూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమాతగా పేరొందిన శివాజినగర్‌లో ని సెయింట్‌మేరీ బలిసికా చర్చ్ వార్షిక ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శివాజినగర్ ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్, ఆర్చ్‌బిషప్ బెర్నార్డ్ మోరస్ ఇతర ధర్మ గురువులు ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. సెప్టెంబరు 8 వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ప్రతిరోజూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ముగింపురోజున మేరీమాతను రథంపై శివాజినగర్ పురవీధులలో ఊరేగిస్తారు. ఉత్సవాల నేపథ్యంలో చుట్టుపక్కల ప్రాంతాలలో ట్రాఫిక్‌ను క్రమబద్దీకరిస్తున్నారు.



ఉత్సవాల ప్రారంభోత్సవంలో ఆర్చ్ బిషప్, ఎమ్మెల్యే తదితరులు

వ్యవహారిక భాష ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి

పెనుకొండ, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): వ్యవహారిక బాష ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ అన్నారు. శుక్రవారం గిడుగు రామ్మూర్తి జయంతిని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అధ్యాపకులు హఫీజ్, బషీర్, ఎస్ఎస్ మూర్తి, రామారావు, సుధారాణి, రాజగోపాల్, స్రవంతి, ఎన్ఎస్ఎస్ పీఓలు శివన్న, రవికుమార్, శ్రీలేఖ పాల్గొన్నారు. సత్యసాయి కళాశాలలో ఏఓ కేశవయ్య ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. తెలుగు అధ్యాపకుడు మంజునాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మడకశిర టౌన్(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజేపీ జూనియర్ కళాశాలలో శుక్రవారం తెలుగుభాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌కే బషీరున్నీసా మాట్లాడుతూ భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఎస్వైఆర్ డిగ్రీ కళాశాలలో తెలుగుభాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్వర్యంలో నిర్వహించారు.

విద్యార్థుల్లో సేవాభావం పెరగాలి

● విద్యానిపుణుడు రాజేశ్ పద్మార్



శిబిరం ప్రారంభిస్తున్న రాజేశ్ పద్మార్, రుక్మాంగదనాయుడు

బెంగళూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు సేవా భావం పెంచుకోవాలని విద్యానిపుణుడు రాజేశ్ పద్మార్ అభిప్రాయ పడ్డారు. శ్రీకృష్ణ గ్రూప్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యాసంవత్సరానికి సంబం ధించి ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. సంస్థ అధ్యక్షులు ఎం రుక్మాంగదనాయుడు, మణిపాల్ ఆసుపత్రి హృద్రోగనిపుణుడు పవన్‌కుమార్ పి రసాల్కర్‌లు పాల్గొన్నారు. విద్యార్థి దశలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ వికాసానికి పునాది కానుందని అధ్యక్షులు రుక్మాంగదనాయుడు తెలిపారు.

దుస్తుల ఎంపికలో ప్రాధాన్యం ఉండాలి

బెంగళూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): దుస్తుల ఎంపికలో నాణ్యత, ప్రాధాన్యత వినియోగదారులు ఎంచుకోవాలని ప్రముఖ క్రికెటర్ రాహుల్ ద్రావిడ్ అభిప్రాయపడ్డారు. జపాన్‌కు చెందిన యునిక్లో బ్రాండ్ షోరూంను శుక్రవారం ఓరియన్‌మాల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాహుల్ ద్రావిడ్ మాట్లాడుతూ ఇదో మంచి బ్రాండ్ అని కొనియాడారు. వ్యక్తిగతంగా నాకు ఇష్టమన్నారు. బ్రిగేడ్ గ్రూప్ జాయింట్ ఎండీ నిరూపా శంకర్, యునిక్లో ఇండియా సీఈఓ కెంజి ఇనొయే పాల్గొన్నారు. బెంగళూరులో తొలిశాఖను తెరిచినట్టు తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం శిక్షార్హం

రాష్ట్ర ఉప లోకాయుక్త వీరప్ప



జల శుద్ధీకరణ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వీరప్ప

రాయచూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ సమస్యలకు సంబంధించి ఇచ్చిన ఫిర్యాదుల పై పరిష్కారం చూపకపోవడం శిక్షార్హమని రాష్ట్ర ఉప లోకాయుక్త బీ వీరప్ప అన్నారు. ఈ విషయంలో అధికారులు ఉద్దేశపూర్వక జాప్యం ప్రదర్శిస్తే శిక్ష తప్పదని స్పష్టం చేశారు. లోకాయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించే ఫిర్యాదుల స్వీకరణ పరిష్కారం పెండింగ్ వివరాల వెల్లడి కార్యక్రమాన్ని శుక్రవారం ఉప లోకాయుక్త ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వీరప్ప, అధికారుల సహకారం లేకపోవడం వల్లే లోకాయుక్త పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 25 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. కొంతమంది అధికారులు తమ ఫిర్యాదులకు సంబంధించి పిలిచిన ప్రతి సందర్భంలోను సమావేశాలు ఉన్నాయంటు తప్పించుకుంటున్నారని, మరికొంత మంది పరిష్కరిస్తామంటు హామి ఇచ్చి నిర్లక్ష్యం వహిస్తున్నారని వివరించారు. ఈ విషయంలో ప్రజల సమస్యను పరిష్కారం పరిష్కరించే బాధ్యతను అధికారులు నిబద్ధతతో నిర్వహించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారికి వివిధ సెక్షన్ల ద్వారా విధించే శిక్షల గురించి ఈ సందర్భంగా ఉప లోకాయుక్త వివరించారు. కాగా ఈ సందర్భంగా జిల్లాకు చెందిన ప్రజల నుంచి పలు ఫిర్యాదులు స్వయంగా ఉప లోకాయుక్త స్వీకరించారు.

రెండో రోజు తనిఖీలు

రాష్ట్ర ఉప లోకాయుక్త బీ వీరప్ప రెండవ రోజు శుక్రవారం జిల్లాలో పలు ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాలూకాలోని చిక్కసుగూరు సమీపంలోగల కేఐఏడీబీ పరిసరాలను పరిశీలించిన ఉప లోకాయుక్త అక్కడ జల శుద్ధీకరణ ప్లాట్‌లను పరిశీలించారు. మొదటి రోజు నగరంతో పాటు పలు ప్రాంతాలను తనిఖీ చేసిన ఉప లోకాయుక్త రెండవ రోజు ఉదయం నుంచే వివిధ ప్రదేశాల్లో తిరుగుతూ సమస్యలను నేరుగా పరిశీలించే ప్రయత్నం చేయడం గమనార్హం.

పరిటాల విగ్రహావిష్కరణకు తరలిరండి

రొద్దం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరిగే పరిటాల రవి కాంస్య విగ్రహావిష్కరణకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని టీడీపీ కన్వీనర్ నరహరి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పరిటాల రవీంద్ర 67వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో శనివారం ఉదయం 10గంటలకు కాంస్య విగ్రహం ఆవిష్కరిస్తారన్నారు. మంత్రి సవిత ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, అశ్వత్థనారాయణ, మారెప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు వీరాంజనేయులు, టైలర్ ఆంజనేయులు, డైరెక్టర్ తిరుపాల్‌నాయుడు, వాల్మీకి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గోరంట్ల (ఆంధ్రజ్యోతి): పెనుకొండలో శనివారం పరిటాల రవీంద్ర కాంస్యవిగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. సోముశేఖర్, నిమ్మల చంద్రశేఖర్, నాగేనాయక్, తిరుపాల్, జయచంద్ర పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,629.01
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	36.726	29,014
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	38,894	9,843
నీటి నిల్వ (టీఎంసీలు)	79.80	90.38

రేపు శిక్షణ శిబిరం

● న్యాయాధికారి రాజేశ్ హొసమనె



బళ్లారి సిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించే శిక్షణ శిబిరం నగరంలోని తాళూరురోడు జిల్లా కోర్టు సముదాయంలో ఆదివారం నిర్వహించనున్నట్లు సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోర్టు మొదటి అంతస్తు ఆడిటోరియంలో కొప్పళ, బళ్లారి జిల్లాల న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై ఒక రోజు పునశ్చరణ శిక్షణా శిబిరాన్ని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పిల్లల రక్షణకు ఎన్నో చట్టాలు

● తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలి: న్యాయాధికారి కేజీ శాంతి



బళ్లారి సిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పిల్లల రక్షణకు న్యాయశాస్త్రంలో ఎన్నో చట్టాలున్నాయని, వాటిపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయాధికారి కేజీ శాంతి అన్నారు. జిల్లాలీగల్ సర్వీసెస్ అథారిటీ, పాఠశాల విద్య అక్షరాస్యత శాఖ మార్గదర్శకత్వంలో రీడ్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రచురించిన 'లా ఫర్ చైల్డ్ ప్రొటెక్షన్ పుస్తకాలను జిల్లాలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ పిల్లల రక్షణ బాధ్యత పిల్లల జీవసంబంధమైన తల్లిదండ్రులదే అయినప్పటికీ, ప్రభుత్వమే అవగాహన కల్పించడానికి ఈ పుస్తకాలను అందజేస్తుందన్నారు. సామాజిక దురాచారాల నుంచి పిల్లలను రక్షించడానికి సంబంధించిన అంశాలపై సమగ్ర సమాచారం ఇందులో ఉందన్నారు. ఈపుస్తకాన్ని రీడ్స్ ఇప్పటికే జిల్లాలోని ఐదు తాలూకాల్లోని 719 జూనియర్ సీనియర్ ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలకు తాలూకాల వారీగా పంపిణీ చేసిందన్నారు. ఈపుస్తకాలను బళ్లారి వెస్ట్ డివిజన్‌లోని 141,బళ్లారి తూర్పు డివిజన్‌లోని 177 కంప్లిలో 52, సండూర్‌లో 249 ,సిరుగుప్పలో 100పాఠశాలలకు పంపిణీ చేశారు. పాఠశాలల్లో ప్రార్థనల తర్వాత ప్రతిరోజు ఒక పేజీ చదవడం ద్వారా పిల్లలకు సంబంధించిన చట్టాల గురించి పిల్లల జ్ఞానాన్ని పెంచే లక్ష్యంతో పుస్తకాలు అందజేశామన్నారు.

వీరభద్ర శివాచార్య స్వామీజీ శివైక్యం



బళ్లారి సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) తెక్కల కోట పట్టణం కంబళి మఠానికి చెందిన వీరభద్ర శివాచార్య స్వామీజీ(69) బుధవారం శివైక్యం చెందారు. వీరభద్ర స్వామీజీ తన 16వ ఏట 1971లో ఉజ్జయిని సద్దర్మ పీఠానికి చెందిన సిద్దేశ్వర భగవత్పాద స్వామీ జీ నుంచి శివాచార్య దీక్షను, గురుత్వాన్ని అందుకున్నారు. బుధవారం సాయంత్రం 5గంటలకు పట్టణంలోని శ్రీ సద్దర్మ జ్ఞాన చేతన ప్రాంగణంలోని కొత్త ఆశ్రమంలో అంత్యక్రియలు జరిగాయని ఆశ్రమవర్గాలు తెలిపాయి. ఉజ్జయిని పీఠానికి చెందిన సిద్దలింగ రాజదేశికేంద్ర శివాచార్య స్వామీజీ సహ వివిధ మఠాల నుంచి స్వామీజీలు అంత్యక్రియలో పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్ భావితరాలకు స్ఫూర్తి

● జాతీయ క్రీడా దినోత్సవంలో క్రీడల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె గ్రేసీ ● పాఠశాలల్లో ఉత్సాహంగా ఆటల పోటీలు ప్రారంభం



మొక్కకు నీరు పోసి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న గ్రేసీ

బళ్లారి సిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ధ్యాన్‌చంద్ ఎన్నో తరాల క్రీడాకాలుకు స్ఫూర్తిదాయకమని, ఆయన జయంతిని క్రీడాదినోత్సవంగా జరుపుకోవడం హర్షణీయమని క్రీడల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కే.గ్రేసీ అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, యువజన సాధికారత క్రీడా శాఖ, పాఠశాల విద్యా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన బళ్లారి తాలూకా స్థాయి దసరా క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక ఆరోగ్యానికి క్రీడలు చాలా అవసరమని, గెలుపోటములు సమానంగా తీసుకుని యువత క్రీడల్లో పాల్గొనాలన్నారు. భారతదేశపు గొప్ప ఆటగాడు మేజర్ ధ్యాన్ చంద్ సహకారాన్ని గుర్తు చేసుకునేందుకు ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. ఆయన అనేక తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. జిల్లాలోని వివిధ తాలూకా స్థాయి దసరా క్రీడాపోటీల్లో పాల్గొని గెలుపొందిన క్రీడాకారుల కోసం జిల్లాస్థాయిలో దసరా క్రీడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బళ్లారి తాలూకా స్థాయి దసరా క్రీడాపోటీలలో పాల్గొనేందుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ అందుబాటులోకి తెచ్చారు. జిల్లాస్టేడియంలో తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించారు. అనంతరం వివిధ క్రీడలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో హాకీ కోచ్ జాకీర్, పుట్‌బాల్ కోచ్ మసూర్, జిల్లాపిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ కార్యదర్శి సిద్దూ, బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బుజ్జీ, డిపార్ట్‌మెంట్ సిబ్బంది, బళ్లారి తాలూకాకు చెందిన క్రీడాకారులు ,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన సమాజానికి క్రీడలు తప్పనిసరి

మన సమాజాన్నిఆరోగ్యంగా ఉండాలంటే క్రీడా కార్యకలాపాలు ప్రతి ఒక్కరికీ అవసరమని విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మునిరాజు అన్నారు. శుక్రవారం నగర శివారు లోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో జరిగిన హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక రకమైన క్రీడా కార్యకలాపాల్లో పాల్గొన్నప్పుడే శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారన్నారు. రిజిస్ట్రార్ నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడా కార్యకలాపాలను తమ జీవితంలో ఒక భాగంగా స్వీకరించాలని, అప్పుడే జీవితం పరిపూర్ణంగా ఉంటుందని అన్నారు. ఆల్ ఇండియా సదరన్ జోన్ ఇంటర్-యూనివర్శిటీ గేమ్స్‌లో పాల్గొన్న విశ్వవిద్యాలయ క్రీడాకారులకు అవార్డు, సర్టిపికేట్లను పంపిణీ చేశారు. క్రీడాదినోత్సవంలో బాగంగా విశ్వవిద్యాలయ సిబ్బందికి క్రీడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో విశ్వవిద్యాలయ సిండికేట్ సభ్యులు రమేశ్‌సావడి, అర్జోబానాయక్, ర అమరేశ్ నుగదోని, రఘునాథ్ చాహా, డాక్టర్ సంపత్ కుమార్, క్రీడల విభాగాధిపతి శశిధర్ కెల్లూరు, విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాల డీన్‌లు, అధిపతులు, బోధన , బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ధ్యాన్‌చంద్‌కు నివాళి అర్పిస్తున్న ప్రొఫెసర్లు, అధ్యాపకులు

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

కంప్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): యువతీ యువకులు, విద్యార్థినీ విద్యార్థులకు క్రీడలతోనే మానసిక ఒత్తిళ్లు దూరమవుతాయని తాలుకా పంచాయతీ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లన్నగౌడ తెలిపారు. కంప్లి పట్టణంలో శ్యామియాచంద్ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన హైస్కూలు క్రీడలను జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ క్రీడల్లో 28 హైస్కూల్లో విద్యార్థులు పాల్గొన్నారు. శుక్ర, శనివారం రెండు రోజుల పాటు ఈ క్రీడలను నిర్వహిస్తున్నారు. ఈ క్రీడల్లో ఖోఖో, వాలీబాల్, పరుగు పందేలు, టెన్నిస్ బాల్, చెస్, బ్యాడ్మింటన్ ఇతర క్రీడలు ఏర్పాటు చేశారు. యేడాదికి ఒకసారి ఈ క్రీడలు జరపడం వల్ల విద్యార్థుల్లో ఉల్లాసం, ఉత్సాహం పెరిగి విద్యాభ్యాసం ఎక్కువ దృష్టి సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డబసప్ప, రేణుకారాధ్య, వీరేష్, రేవన్న, టీఎం బసవరాజు, హనుమంతు, శర్వేష్, భీమేశ్వర, అశోక్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న పంచాయతీ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లన్నగౌడ



పీడీ హళ్లిలో వినాయకుడి ఊరేగింపు

ఘనంగా గణనాథుడి నిమజ్జనం

బళ్లారిరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని పరమదేవనహళ్లి గ్రామంలో శుక్రవారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రముఖులు, యువకుల ఆధ్వర్యంలో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. రామలింగేశ్వర దేవస్థానం నుండి గ్రామ పురవీధుల్లో యువకుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భజన భక్తి గీతాలు యువకుల నృత్యాల ద్వారా గ్రామ పుర వీధుల్లో సాగింది.

జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన బాలికలు

హోసూరు (కృష్ణగిరి), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో చీఫ్ మినిస్టర్స్ ట్రోఫీ పోటీలు సాగాయి. వాలీబాల్ విభాగంలో బాలికలజట్టు విజేతగా నిలిచింది. తమిళనాడు క్రీడల విభాగం ఆధ్వర్యంలో పలు రకాల పోటీలు నిర్వహించారు. ఇందులో హోసూరుకు చెందిన తంగవేల్ వాలీబాల్ అకాడమీ బాలికల జట్టు సత్తా చాటుకుంది. విజేతగా నిలిచిన జట్టును కోచ్ మాణిక్కవాసగం, జిల్లా క్రీడల అధికారి రాజగోపాల్ అభినందించారు.



విజేతగా నిలిచిన వాలీబాల్ జట్టు

పరిసరాల జాగ్రుతిపై దృష్టి సారించాలి

● నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ



మొక్కలు నాటుతున్న నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ

సిరుగుప్ప, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : పరిసరాల జాగ్రుతిపై ప్రతి ఒక్కరు దృష్టిసారించాలని నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ అన్నారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణం 16వ వార్డు ఆశ్రయ కాలనీలో పరిసర జాగృతి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలు నాటి మాట్లాడుతూ ఉత్తమ పరిసరాల వలన మనిషికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు ఇళ్ల ముందు మొక్కలు నాటి పరిసరాలు కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా స్కంద విద్యాసంస్థ వలంటీర్లు పాల్గొన్నారు.

చెత్త సేకరణ తప్పనిసరి: కలెక్టర్

సిరుగుప్ప, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వీధుల్లో ఇంటింటి వద్ద చెత్తా చెదారం సేకరణ తప్పనిసరి అని, మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా సూచించారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన సిరుగుప్ప పట్టణంలో అన్ని వార్డుల్లో వుండే చెత్తాచెదారం నిర్వహణ కేంద్రాలను సందర్శించారు. అక్కడ చెత్తా చెదారం సేకరణ పై ఆయన నగరసభ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో వున్న చెత్తాచెదారాన్ని కుండీలలో వేసి నగరసభ వాహనాలలో వేయాలని సూచించారు. పరిశుభ్రత పాటించడం వలన మనిషికి ఉత్తమ ఆరోగ్యం పొందడం సాధ్యపడుతుందని తెలిపారు. నగరసభ కమిషనర్ గంగాధర, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హిందువులు కదిలి రావాలి

● ధర్మస్థల రక్షణ.. అందరి బాధ్యత
● సత్యయాత్రను విజయవంతం చేయాలి
● జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ



మాట్లాడుతున్న జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ

బళ్లారి సిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బ తినేలా కాంగ్రెస్ ప్రవర్తిస్తోందని, ధర్మస్థలను కాపాడుకోవడం హిందువుల కర్తవ్యమని జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది స్వార్థపరులు, దుండగులు ధర్మస్థల పేరును కళంకం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ధర్మస్థలలో వందలాది హత్యలు జరిగాయని తప్పుడు వాదనలను నమ్ముతూ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేయడం భక్తుల మనోభావాలను దెబ్బ తీయడమేనన్నారు. ఈ అబద్దాలు దుష్ప్రచారాలను వ్యాప్తి చేసే వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకనిపించని హస్తాల కుట్రను వ్యతిరేకించడానికి,జనతాదళ్ సెక్యులర్(జేడీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదిన ధర్మస్థలంలోని నేత్రావతి నుండి జేడీఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి నేతృత్వంలో భారీ పాదయాత్ర నిర్వహించామని , ఈపాదయాత్రలో జిల్లా నుండి వందలాది మంది పాల్గొంటారని ఆయన తెలిపారు. విలేకరుల సమావేశంలో బళ్లారి నగర యూనిట్ అధ్యక్షుడు హొన్నూర్ స్వామి (వండ్రి) మహిళా యూనిట్ జిల్లా అధ్యక్షురాలు పుష్ప,నగర యువజన విభాగం అధ్యక్షుడు కిరణ్ కుమార్, సిరుగుప్ప తాలూకా అధ్యక్షుడు శివ నారాయణ, ముత్తు, ప్రదీప్,హొన్నళ్లి రాజ్,రుమాన,విజయ,నాగవేణి,ఇతర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యయాత్రను విజయవంతం చేద్దాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజునాయక్

కంప్లి (ఆంధ్రజ్యోతి): ధర్మస్థలలో ఈ నెల 31న నిఖిల్ కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగే సత్యయాత్రను విజయవంతం చేపడదామని రాష్ట్ర జనతాదళ్ పార్టీ కార్య అధ్యక్షుడు రాజునాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం కంప్లి ప్రభుత్వ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడిన ఆయన ధర్మస్థలను హిందూ వ్యతిరేక మతశక్తులు అస్థిరపరుస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. దీని వెనుక కొన్ని వామపక్ష సంస్థల హస్తం ఉందని, సోషల్ మీడియాలో ధర్మస్థలం గురించి అనుచిత పోస్టులు పోస్టు చేసే వారిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మైసూరులోని చాముండేశ్వరి ఆలయం హిందువులకు మాత్రమే కాదని చెప్పిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటనను వెనక్కి తీసుకోవాలన్నారు. మొత్తం దేశంలోని హిందువులకు క్షమాపణ చెప్పాలని రాజు నాయక్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేగరాజు, ఇర్ఫాన్, జగదీష్ పూజారి, అంజినప్ప, నాగరాజు, గాదిలింగప్ప, రాజా మంజునాథ్, వీరన్న, రమేష్, జనతాదళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్‌పోటీలకు ఎంపిక

బళ్లారి రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని కప్పగల్లు శారదా ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు జిల్లా స్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. గత వారం రోజులుగా బళ్లారి నగరం జ్ఞానామృత కాలేజీలో జరుగుతున్న పోటీల్లో తాలూకా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాహ్నవి, వికాస్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయినట్లు స్కూలు కరెస్పాండెంట్ పరమేశ్వరప్ప తెలిపారు. హెచ్‌ఎం నేత్రప్రసన్న స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.



జాహ్నవి, వికాస్

చిరుత సంచారంతో భయం..భయం..

రాయచూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని డీ రాంపూర్, మలియాబాద్ గ్రామ పరిసరాల్లో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. డీ రాంపూర్ సమీపంలోని ఒక రైతుకు చెందిన ఆవు దూడను చంపివేయడం కలకలం రేపింది. ఇంటితో పాటు రోడ్డు పరిసరాల్లో చిరుత సంచరించినట్లు వాటి జాడలను గుర్తించిన గ్రామస్థులు అటవి శాఖ అధికారులకు పిర్యాదు చేశారు.

హోసూరు జోన్



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

విద్యతోనే జీవితానికి సార్ధకత: ఎమ్మెల్యే

హోసూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విద్యతోనే జీవితానికి సార్ధకత సాధ్యమని ఎమ్మెల్యే ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. హోసూరు ఆర్‌వీ అరసు బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటైన కార్యక్రమానికి అధ్యక్షత వహించగా సబ్‌కలెక్టర్ ఆకృతిశెట్టి ముఖ్యులుగా పాల్గొన్నారు. ఉన్నత విద్యకోసం మార్గదర్శకంచేసేలా కార్యక్రమం సాగింది. ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహిస్తోందని విద్యార్థులు చక్కగా రాణించాలని పిలుపునిచ్చారు. 12వ తరగతి వరకు స్కాలర్‌షిప్‌గా ప్రతి నెలా వెయ్యిరూపాయలు ఇస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీకు ఇష్టమైన డిగ్రీ కోర్సు చదివి ప్రయోజకులై తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాథమిక విద్యా అధికారి మునిరాజ్, పన్నీర్ సెల్వం, మహేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే

'మీతో స్టాలిన్'పేరిట నియోజకవర్గంలో ఏర్పాటైన శిబిరాలలో ఎమ్మెల్యే వై ప్రకాశ్ పాల్గొని ప్రజల సమస్యలు ఆలకించారు. బేగేపల్లి పంచాయతీ యూనియన్‌లోని మిడిల్‌స్కూల్‌లో శుక్రవారం శిబిరం ఏర్పాటు చేశారు. మీ ఇల్లు ప్రభుత్వాన్ని చూస్తోంది అనే ప్రాజెక్టులో సాగుతున్న పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. దివ్యాంగుల సంక్షేమశాఖ, మహిళా హక్కుల నిధి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి గజేంద్ర మూర్తి, యూనియన్ కమిటీ మాజీ సభ్యుడు గోపాల్, శివ, డీఎంకే కార్యనిర్వాహకులు వేణు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

వాడవాడలా వినాయక సందడి

బళ్లారి సిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నగరంలోని వెంకటేశ్వర్ నగర్ ఆభయాంజనేయ స్వామి దేవస్థానంలో 30వ వార్షిక గణేశ్ ఉత్సవాలను బుధవారం ఘనంగా ఆచరించారు. వినాయకుడికి శాస్త్రీయంగా పూజలు జరిపి సాయంత్రం ఆలయ కల్యాణ మంటపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో తుంగ-గంగా కళాకారులు ,కుడితిని శివం కళాకారులు ప్రదర్శించిన సంగీత నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కళాకారులకు మోమెంట్‌లు ఇచ్చి సత్కరించారు. ఈసందర్భంగా దేవస్థానం అధ్యక్షుడు ధనుంజయ 30ఏళ్ల ఉత్సవానికి సహకరించిన భక్తులందరికి అభినందనలు తెలిపారు.



పూజల్లో పాల్గొన్న విదేశీయుడు



కంప్లిలో రథంపై వినాయకుడు

కంప్లిలో రెండో రోజు

కంప్లి/గంగావతి రూరల్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయక పండుగ రెండో రోజు పురస్కరించుకుని వార్డుల్లో ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. శుక్రవారం వినాయక నగర్‌లో వినాయక మహారాజు గణపతి సంఘం ఆధ్వర్యంలో వార్డు ప్రజలకు అన్నదానం చేపట్టారు. పట్టణంలో ఆకట్టుకునే రీతిలో వినాయకులు కొలువుదీరాయి. శివపార్వతుల జతకి వినాయకుడు విగ్రహం భక్తులను ఆకట్టుకుంటుంది. యుద్దానికి వెళ్లే వినాయకుడు రథంపై పూర్తిగా ఆకట్టుకుంటున్నారు. రాధాకృష్ణ తోడుగా వినాయకుడు వివిధ రూపాలతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళలో ఏ మండపం వద్ద చూసినా మహిళలు, భక్తులు కనిపిస్తున్నారు.



శివపార్వతుల గణపతిని ప్రతిష్ఠించిన భక్తులు

సందడి చేస్తున్న జోకుమారుడు

వినాయక చవితి సందర్భంగా జోకుమార ఇంటింటికీ తిరుగుతూ సందడి చేస్తున్నాడు. పూలతో నిండిన బుట్టలో జోకుమార స్వామికి ప్రత్యేక పూజలు చేయడం కనిపించింది. గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేసిన మరుసటి రోజు జోకుమార గంగామత సమాజ కుటుంబంలో జన్మించి తరువాత ఏడు రోజుల పౌర్ణమి రోజుతో ముగించుకుని జోకుమారస్వామి రైతులు దేవుడు అని పిలుస్తారు. జోకుమారుడు నూనె, బంకమట్టితో తయారు చేయబడుతుంది. జోకుమార విగ్రహాన్ని వేప ఆకులు, సజ్జలు, జొన్నలు, పూలతో రావణంద అలంకరణతో పూజిస్తారు. భక్తులు వారికి ధాన్యాలు, డబ్బు ఇస్తారు. వాటితో పాటు దానానికి ప్రతిఫలంగా మహిళలు నల్ల సిరా కలిపిన వేప ఆకులు, మొక్కజొన్న, జొన్న, మిరపకాయలు మొదలైన వాటిని ఇస్తారు. వాటిని పొలం అంతటా చెల్లాచెదురుగా పెడితే మంచి పంట వస్తుందని నమ్ముతారు. వేప ఆకులతో అలంకరించబడిన జోకుమారస్వామి విగ్రహాన్ని తీసుకెళ్లడం గంగామత వర్గానికి చెందిన మహిళలు ఇంటింటికీ తిరిగివెళ్లడం ఇక్కడ ఒక ఆచారం. ఒక వైపు, పిల్లలు జోకుమార్‌ను గణపతి వెళ్లిపోయాడు. జోకుమార్ ఇంటికి వచ్చాడని అరుస్తూ స్వాగతం పలుకుతారు, మరోవైపు జోకుమార ప్రతిష్టించిన గణేశుడిని చూడకపోవడం ఆచారం జోకుమార రాగానే, గణేశుడికి అడ్డంగా ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకంగా అలంకరించబడిన బుట్టలో జోకుమారస్వామి విగ్రహాన్ని మోసుకెళ్లే మహిళల బృందం వీధుల్లో ఆయనను పూజిస్తూ, జోకుమార జానపద పాటలు పాడుతూ భక్తులు నుండి నైవేద్యాలను స్వీకరిస్తుంది. ఇంటి నుంచి నూనె, బియ్యం, పప్పులు, బెల్లం, కొబ్బరి, మిరప కాయలు, కూరగాయలు, పత్తి, జొన్నలు, మినుములు పొందడం ఆచారం. దీని ప్రకారం మహిళలు, నగరాలు, గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి జోకుమార పాటలు పాడుతూ భక్తులు సమర్పించే ధాన్యాన్ని తీసుకువెళతారు. గ్రామంలో వారు ఎప్పటికప్పుడు వర్షం పంటల కోసం ప్రతి ఒక్కరూ ఆనందం, శాంతి, శ్రేయస్సులతో జీవించాలని ప్రార్థిస్తారు. దేశ సాంప్రదాయం ప్రకారం మేము ప్రతి యేడాది జోకుమారను జరుపుకుంటాము. జోకుమారస్వామి, పాత దరోజీ, కంప్లి, కురుగోడు, కుడితిని పట్టణాలతో పాటు గ్రామాల్లోని గంగామత సమాజానికి చెందిన బారికర హులిగెమ్మ ఇంట్లో జన్మించాడు. ఇది పౌర్ణమి రోజున ముగుస్తుంది. ఎన్నో కుటుంబాలు సంబరాలు చేసుకుంటున్నాయని మహిళ హులిగెమ్మ తెలిపారు. చంద్రమ్మ, ఈరమ్మ, హులిగెమ్మ, నింగమ్మ, నాగమ్మ, లింగప్ప, జడెమ్మ, శారద తదితరులు ఉన్నారు.



జోకుమారుడిని తీసుకువచ్చిన గంగమతస్థులు



మహారాజ గణపతి



రాధాకృష్ణుల తోడుగా..